# రోశనీ

అద్దంలో చూసుకుంటూ టై బిగించుకొంటున్నాను. మెత్తటి అడుగుల చప్పుడు....రజని ప్రతిబింబం కనిపించింది.

హేంగరునుండి కోటుతీసి తొడుక్కున్నాను.

"ఈ సాయంకాలం ఏదో ఫంక్షన్ తగిలినట్లుందే" కళ్ళతో నవ్వుతూ అడిగింది రజీ.

"ఆc కాస్త అలస్యమవుతుందేమో నీవు త్వరగా భోజనంచేసేయ్."

"ఈ సాయంకాలం ఎంత బాగుంది" అంది కిటికీలోనుండి మేఘాలకేసి చూస్తూ.

"అయితే...." అన్నాను కాస్త సెంటు కోటుకు రాసుకుంటూ.

"అబ్బే ఏంలేదు, ఇంతకూ ఏ స్నేహితుడికి సన్మానం" అంది అతి మామూలుగా.

"నీకు ఈ సిక్స్ సెన్స్ ఎవరిచ్చారోగాని...."రావు గారు వ్రాసిన పెద్ద కథనుగురించి... అదే" బూటుకు లేసు కట్టుకుంటూ ఆగిపోయాను.

పక్కుమని నవ్వేసింది రజని.

"ఏమిటది" అన్నాను తెల్లబోతూ.

"మీ పని బాగుందండి. పదిమంది రచయితలు కలిసి మీలో మీరే వారానికి ఒక సన్మానమయినా చేసుకుంటూ వుంటారు. పోనీలెండి. అదోతృప్తి. ఒక విధంగా పబ్లిసిటీ కూడాను.

నాకు ఒళ్ళు మండింది. ఇటువంటి మాటలవలనే రజని నాకు దూరమయ్యే ప్రమాదముంది.

"నీ అభిప్రాయం ఎవరూ అడగలేదులే. నీకు తెలీకపోతే పూరుకో, అనవసరంగా నోరు పారవేసుకోకు."

నా దగ్గరగావచ్చి తన రెండు చేతులతో నా మొహాన్ని పట్టుకుని "అంతలో కోపమా! పరిహాసమయినా తట్టుకోలేని మీరు సాహిత్య విమర్శ ఎలా చేస్తారబ్బా" అని నవ్వింది.

నేనేం మాటాడలేదు.

"మొహం ఎర్రబడింది. కొద్దిగా పౌడరు రాసుకుని అద్దంలో ఒక సారి చూసి నవ్వేసుకోండి. మంచి మూడ్ వస్తుంది, బాపురే....పాలగిన్నె స్టవ్‌మీద, అంటూ పరుగుదీసింది.

చదువుకున్న భార్య....అందులో నాతో సమానంగా ఉద్యోగం చేసే భార్య....తన స్వతంత్ర భావాలు తనవి. వద్దనటానికి నాకేం హక్కుంది? సరే. ఆ"రావు" వ్రాసిన కథ గురించి ఏవో నాలుగు ముక్కలు చెప్పవద్దూ. నా మటుకు ఆ కథలో ఏ విశిష్టతా కనిపించ లేదు. మంచికథే, పదిమందీ చదివి ఆనందించ దగింది కాని సన్మానం చేసేంతటి గొప్ప దానిలో ఏముందో! ఏమో! "నాయుడు" "రావు" బాగా స్నేహితులు, నాయుడు తెచ్చాడు ఈ ప్రసక్తి. నా సొమ్మేం పోయిందని సరేనన్నాను. ఆకథలో ఏవోకొన్ని ముక్కలు గుర్తుంచుకొని వాటికి అందం, అర్ధం, వ్యగ్యం, లోతైన భావం ఆపాదించక తప్పదు. ఆలోచిస్తూ నెమ్మదిగా కదిలాను సభకు.

* * *

సోమవారం సాయంకాలం ఇంటికిరాగానే రజని కళ్ళలో నవ్వు దాచుకొంటూ స్వాగతం చెప్పింది.

"ఈ రోజు త్వరగా వచ్చేశావే?" అన్నాను.

"ఆఁ లాస్టవరు క్లాసులేదు."

బట్టలు మార్చుకునిమొహం కడుకున్నాను. కాఫీ బల్లపై పెట్టూ "కంగ్రాచ్యులేషన్సు" అంది నాకుతెలుసు ఆ ధోరణి. ఏదోకథ అచ్చయి వుంటుంది.

"ఏ పత్రిక" అన్నాను కాఫీ తీసుకుంటూ.

మెరుపులావెళ్ళి "ఆ" పత్రికతెచ్చి నా ఎదుట పడేసింది.

చదువుతూ కూర్చున్నాను.

"ముందు ఆ కాఫీ సంగతి చూడండి. మీరు వ్రాసినకథకే అంత మురుసుకోవాలా?"

అలాంటి సమయంలో ఏ రచయితకు కోపంరాదు చెప్పండి. చేతి వ్రాతలోని రచనకు అచ్చులోని రచనకూ తేడావుండదూ. అదిచూసి "నేను వ్రాసిందేగా" అని విసిరేసుకుంటాదా? చదువుకోరు? అన్నిటి

కంటే మనకథే ఎక్కువ వివరంగా చదువుతామాలేదా? పత్రిక పక్కకు బెట్టి కాఫీకప్పు అందుకున్నాను. అప్పుడయినా చెప్పకూడదూ కథ బాగుందని.

నేనే తెగించి అడిగాను "కథబాగుందా?"

గుండు మల్లెలు మాలగా గుచ్చటానికి కాబోలు సూది వెతుక్కుంటుంది.

"ఏకథ?" అంది పరధ్యానంగా (అదే సూది ధ్యానంగా)

నేనేం మాట్లాడలేదు.

వెనక్కి తిరిగి నవ్వేస్తూ "ఓహ్ ఇదా? బాగానేఉంది, మీరు కథలే వ్రాస్తారుగా" అంది బల్లదగ్గరకువచ్చి మల్లెలు దోసిటతో ఎత్తి నా నెత్తిన పోసింది.

"రచయితకు సన్మానం" అంటూ నా నుదురు ముద్దుపెట్టుకుంది.

"ఇదంతా పరిహాసమా రజీ ఎందుకు మామూలుగా వుండవు" అన్నాను తన చెయ్యి లాగి కూర్చోబెడుతూ.

"మీరు కీర్తిశిఖరాల నధిరోహిస్తే నాకు గర్వకారణం కాదటండీ" అని సీరియస్‌గా చెప్పి, పక్కుమని నవ్వేసింది.

"అన్నట్టు గోపాలం వచ్చాడు మధ్యాహ్నం"

"మీ కాలేజీకా?" అన్నాను ఆశ్చర్యపోతూ.

"అవును, ఆదారిన వెళ్తూ నన్ను పలకరించాలనిపించిందట, ఈ ఆదివారం వస్తానన్నాడు."

"నా ప్రాణం దీస్తాడు. ఇదొక పీడ" అని విసుక్కున్నాను, రజని మొహం అదోలా మారిపోయింది. మాట్లాడకుండా పూలు గుచ్చుతూ కూర్చుంది.

"కాదు రజీ, వాడికి రచయిత కావాలనే తాపత్రయం ఎందుకు చెప్పు, అవి కథలా? వాటికి పట్టినపీడా? భాష లేదు. భావంలేదు, వాడు పంపిన కథలు రెక్కలు గట్టుకు తిరిగివస్తాయి. ఇప్పటికి వందసార్లు పైగా జరిగి వుంటుంది. పరాభవం అయినా వాడికి ఆత్మాభిమానంలేదు."

రజని ఇప్పుడూ మాట్లాడలేదు.

''మీ బాబాయి కొడుకును చులకన చేస్తున్నానని బాధపడుతున్నావు కదూ''

"అబ్బేలేదు" చిన్నగా నవ్వింది, "మీ కథ గురించి ఆలోచిస్తున్నా.

''నిన్ను ఆలోచింపజేసే కథ ఏదబ్బా''

''అదే క్రితం ఆదివారం పేపర్లో వచ్చింది''

''విశాలహృదయాలా?"

అవునని తలవూపింది. ''దానిలో నాయకుడు అపురూపమైన వ్యక్తికదూ. ఒక్కొక్కసారి ఆశ్చర్యపోతుంటాను, ఇంత ఉన్నత వ్యక్తిత్వాలు మీరెలా చిత్రించగలరా! అని''

ఆ క్షణంలో నా గుండె గర్వంతో పొంగింది. ఎప్పుడూ విసుర్లు విసిరే రజి అంత గంభీరంగా మాట్లాడుతుంటే ఆశ్చర్యమూ కలిగింది.

* * *

ఎంత వద్దనుకున్నా ఆదివారం వచ్చింది. పదిగంటలకే గోపాలం ప్రత్యక్షమయ్యాడు.

"ఏమిటోయ్ యుద్ధ సన్నద్ధుడవై వచ్చావు" అన్నాను.

"లేదండీ బావగారూ. నెలరోజులుగా మిమ్మల్ని కలుసుకోలేక పోయాను. అందుకనీ...." మాట మధ్యలో ఆపేశాడు.

వాడి చేతిలోని కాగితాలకట్ట. బరువైన పెద్ద కవర్లు సంగతంతా చెప్పక చెప్పాయి.

"ఈ నెలలో ఎన్ని తిరిగి వచ్చినట్లు" విలాసంగా సిగరెట్టుపొగ వదులుతూ అడిగాను.

గోపాలం మొహం ఎర్రబడింది. వాడి కళ్ళలో నీళ్ళు మెదిలాయేమో కూడ. వట్టి అర్భకుడు. అంత చేతగానివాడు కథలు వ్రాయుట మెందుకట.

"మీరు ఏ కథా చదివి తప్పొప్పులు చెప్పరు. మరి నా కెలా తెలుస్తుందండి" అన్నాడు మెల్లగా.

"అన్నీ చదవాలటోయ్, ఒకటి చూస్తే తెలీదూ! అయినా వంద మంచి పుస్తకాలు చదివిగాని రచనలు మొదలు బెట్టకు."

"కథలూ, పుస్తకాలుంటే అన్నంకూడా మానెయ్యగలనండి. ఎప్పుడూ చదువుతూనే వుంటాను." ఉత్సాహంగా చెప్పాడు.

నేను గట్టిగానే నవ్వేశాను. "అందుకే బి. ఏ అన్ని పార్టులూ పోయాయి. ముందు నీచదువుచూడు. ఆ తర్వాతే ఇవ్వన్నీ. అయినా నీవు చదివే చెత్త పుస్తకాలు నిన్ను బాగుపరచలేవులే."

"పోనీ ఆ మంచి పుస్తకాలు ఫలానా అనయినా చెప్పరేమిటండీ."

వీడెక్కడి శని అనుకుంటూ పాత పత్రిక ఒకటి చేతిలోకి తీసుకున్నాను.

"బావగారూ....ఈపత్రికలో మీ కథ చదివానండి. చాలా బాగుంది. కాని....ఒక సందేహం"

వీడి బుర్రకు సందేహాలు కూడానా. ఏమిటో ఏడు అనుకున్నాను.

"ఆ మధ్య 'రెడ్డి' గారి సన్మాన సభలో మాట్లాడుతూ "సందేశం" "ప్రయోజనం" లేని కథల మూలంగా అసలు కథల ప్రమాణం పడిపోయిందన్నారు మీరు, నేను మీ అంతలోతుగా ఆలోచించలేదనుకోండి. కాని ఈ ప్రతికలోని మీకథ ఏ సందేశం ఇస్తూందో నాకు బోధ పడ లేదండీ."

వెధవ చచ్చుబుర్ర....వీడూ విమర్శకుడే!

"అన్ని కథలకూ సందేశం వుండనక్కరలేదు. కొన్ని కాలం గడపటానికి రాస్తారు, అయినా సందేశం అనగానే సుమతీ శతకంలోని నీతులను కుంటున్నా వేమిటి? అని బిగ్గరగా నవ్వేను.

ఇంతలో తడి వెంట్రుకలతో రజిని గదిలోకి వచ్చింది తెల్లచీర—చిక్కటి కాటుక కళ్ళు....నా భార్య అని చెప్పుకోవటం కాదుగాని తన వ్యక్తిత్వమంతా ఆకళ్ళలోనే వుంది.

"ఏరా గోపాలం మాటల ధోరణిలో అకలే మర్చిపోయారా?" దువ్వెనతో వెంట్రుకలు సున్నితంగా చిక్కు దీసుకుంటూ అడిగింది.

"బావగారు ఏదో చెబుతుంటే వింటున్నాను అక్కా."

"నీకసలు బుద్ధిలేదురా. నీకథలు, భావాలు గుట్టుగా పెట్టుకోక ఎందుకు పదిమందికి ప్రచారం చేసి నవ్వుల పాలవుతావు?"

వాడి మొహం ముడుచుకుపోయింది. "ఏదో బావగారు పేరున్న

రచయిత కదా అని ఆయన సలహా కోసం వస్తాను గాని దారినపోయే వాళ్ళందరినీ అడుగుతున్నానా?"

"ఇంతవరకు ఎప్పుడయినా ఆయన నీ కథలు ఓపిగ్గా చదివారా?"

"రజనీ" అన్నాను ఉరిమినట్లు.

"నిజం చెబితే కోపమెందుకూ? గ్రహించుకునే శక్తి వీడికిలేదు భోజనానికి లేవండిక" అంటూ వెళ్ళిపోయింది.

భోజనాలయ్యాక గోపాలం తన కట్ట విప్పాడు నాకు నిద్ర వస్తోంది. "అదక్కడ పెట్టి వెళ్ళరా." ఎప్పుడయినా చదివి చెబుతాను.

"తీరిక చేసుకు దిద్దిపెట్టండి బావగారూ. కబురంపితే వస్తాను. నా మటుకు మీ దగ్గర కూర్చుని మీరు లోటుపాట్లు చెబుతుంటే వినాలని వుంటుంది. రచనలు, కవితలు ఎంత "ఒరిజనల్" అయినా వాటికికూడా శిక్షణ అవసరమనిపిస్తుందండి. ఇతర లలితకళలలాగే దీనికి గురు శిష్య సంబంధం ఏర్పడితే......"

"ఆపవయ్యా బాబూ, కబురంపుతానులే తర్వాత, ప్రస్తుతం పడుకోనీ"

సిగ్గుపడిపోయాడు "బాగా ఇబ్బంది పెట్టున్నానండి." లేకపోతే వాడి సాన్నిధ్యంలో మైమరుస్తున్నాననుకుంటున్నాడేమో !

వాడు వెళ్ళిపోయాడు భగవంతునికి దండం పెట్టి కళ్ళు మూసుకున్నాను. అప్పుడు చిత్రమైన ఐడియా వచ్చింది. మా గోపాలంగాడిని సబ్జెక్టుగా తీసుకుని ఒక వ్యంగ్య రచన చేస్తే.... ఆ పాత్రని బాగా హాస్యాస్పదంగా సృష్టించాలి. ఆలోచిస్తూ నిద్రపోయాను.

సాయం కాలం కాఫీతాగుతూ రజనికి క్రొత్త "థీమ్" గురించి చెప్పాను.

రజని కళ్ళల్లో మౌనం.

"బాగుండదూ" అని అడిగాను.

"ఎందుకు బాగుండదూ. చేతిలో కలం వుంది. వేసుకునే పత్రికలున్నాయి మీకు మంచి పేరువుంది. అది ప్రచురింప బడితే మీ "రెడ్డి" "రావు" "నాయుడు" గార్లు సన్మానం కూడా చెయ్యవచ్చు."

మై గాడ్, చాచి లెంపకాయ కొట్టాలనుకున్నాను. ఎంత వ్యంగ్యం! ఎంత గర్వం!

"ఆ మధ్య ఒక కార్టూను చూశాను" అంటూ నవ్వింది.

"ఏమిటో" అన్నాను. నన్ను కాస్త అదుపులో పెట్టుకుంటూ.

"అదే నేను మావూళ్ళో మీకు సన్మాన సభ ఏర్పాటు చేస్తాను. మీ వూరొస్తే నాకు అటువంటిది ఏర్పాటు చేయండి" అని మరలా నవ్వింది.

"ఏమిటా అర్థం పర్థంలేని నవ్వు. నీకు రచనల గురించి ఏమి తెలుసు? నీ కాలేజీ, నీ ఉద్యోగం నీకు అందని కీర్తి నేను పొందుతున్నానని నీకు ఈర్ష్య. నా ఆధిక్యత సహించలేక ఎప్పుడూ విమర్శచేస్తుంటావు."

మీరంటే నాకు ఈర్ష్యా! మీ ఆధికత్యను సహించలేనా? చూడండి ఆధిక్యత ప్రకటించుకుంటే వచ్చేదికాదు. పురుషునిలో నిజమైన గొప్పతనం గుర్తించిన స్త్రీ తన వ్యక్తిత్వాన్ని కూడా పురుషునిలో లీనం చేసుకుంటుంది. మిమ్మల్ని ఇతరుల దృక్పథంలో ఆలోచించమంటున్నానంతే. మీ కీర్తికి ఈర్ష్యపడేది నేను కాదు. మీ స్నేహితులు. ఒక విషయం ఆత్మ సాక్షిగా చెప్పండి. "రెడ్డి"గారి కథకు బహుమతి వస్తే మీరు ఈర్ష్య పడలేదూ!"

"దాన్ని ఈర్ష్య అనరు. 'కాంపిటేటివ్ స్పిరిట్' అంటారు."

"ఏ పేరుతో పిలిచినా ఆ విషయం మీకు ఆనందదాయకంకాదు. మంచి మంచి కథలు వ్రాస్తూ ఉన్నత వ్యక్తిత్వాలు సృష్టించే మీరు గోపాలాన్ని పురుగును దులిపినట్లు దులుపుతారెందుకనీ"

"వాడిని నేను గనుక ఈ మాత్రం భరిస్తున్నాను. ఇంకొకరయితే ఇంటి చాయలకు రానిచ్చేవారు కాదు."

"ఎందుకనీ పుట్టగానే మీరు కలం చేతిలో పట్టుకుని వచ్చారా! మీ కథలు ఒకటైనా తిరిగి రాలేదా! ఇంత పేరూ ఒకనాడే వచ్చిందా! తాత్కాలికమైన పత్రికలో కాలక్షేపానికి వంద కథలు వ్రాసెయ్యగానే పండితోత్తములు అయిపోయారు!"

"రజనీ నీకెమొచ్చిందీరోజు. పూనకం వచ్చినట్టు వాగుతున్నావు"

"అవును పూనకమే. ఎన్నాళ్ళ నుంచో మండుతున్న మంట. మీరెందుకు ఆత్మ విమర్శ చేసుకోరు! ధనవంతుడు పేదవాణ్ణి హింసిం

చటం రూపసి కురూపిని ఏడిపించటం కంటే మీరే విధంగా గొప్ప? పీడిత ప్రజలకు సానుభూతి కుప్పలు తెప్పలుగా కురిపిస్తారే? పీడిత ప్రజలంటే పేదవాళ్ళే కానక్కరలేదు. మా గోపాలం లాంటి వాళ్ళను మీరు పీడించటం లేదూ?"

"ఇదంతా తమ్ముడి మీది ప్రేమా? అన్నాను ఎగతాళిగా."

"కాదు వాడి స్థానంలో ఎవరున్నా ఇలాగే వాదిస్తాను. మీరు నిజంగా గొప్పవాళ్ళయితే వాడి ఆసక్తిని చంపకండి. సలహాలిచ్చి, పుస్తకాలిచ్చి, శిక్షణనిచ్చి వాడిని రచయితను చేసి ధీమాగా నిలబడండి. నేను మెచ్చుకుంటాను. అంతే గాని మీరేదో కారణ జన్ములయినట్లు.... మీ కథలు చదివే వాళ్ళంతా వాజమ్మలయినట్లు...."

"నోర్మూయ్, చదువుకున్న దానివని గౌరవమిస్తే హద్దుమీరుతున్నావు? అల్లుడికి అధికారమిస్తే అర్ధరాత్రి గొడుగు పట్టమన్నాడట. ఆడవాళ్ళని చెప్పుకింది తేలుల్లా అణిచి పెట్టాలందుకే," రజని కళ్ళలో ఎర్రజీరలు అయినా క్రూరంగా నవ్వింది. "ఇదీ అసలు వ్యక్తిత్వం. సత్యానికి, ఆత్మసాక్షి నిలబడకిలేని వ్యక్తిత్వం, అహంకారం ఆధిక్యత ఎందుకోమరి. పూర్వకాలపు మహా కవులు మిమ్మల్ని చూస్తే మీరు గోపాలాన్ని దులిపినట్టే దులిపేస్తారని మీకెప్పుడూ అనిపించలేదూ?"

ఎడా, పెడా రజని చెంపలు వాయించాను. "రాస్కెల్" అని పళ్ళు కొరుక్కున్నాను.

రజని కళ్ళు పెద్దగా, మరింత పెద్దగాఅయ్యాయి. దగ్గరగా వచ్చి నా రెండు చేతులూ పట్టుకుని అలాగే నా ఎదలో తలదాచుకుంది. "మీరు నాకు దేవుడంతటి పవిత్రులు. మీకు ఈ మాలిన్యాలు అంటటం సహించలేను. వీటన్నిటికీ మీరు అతీతంగా....చాలా అతీతంగా వుండాలి." అంటూ వెక్కివెక్కి ఏడ్చింది.

"నా రజీ....నారజీ...." అని తన తలను అవిరామంగా ముద్దు పెట్టుకున్నాను.